## క్లుప్తంగా...

### ఉచితంగా మందుల పంపిణీ

జియాగూడ: జియాగూడ కేశవస్వామినగర్ మూసీనది ఒడ్డున ఉంటున్న గుడిసెవాసుల కుటుంబాలకు పన్నిపురా ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 80 నుండి 100 వరకు గల గుడిసెలు మూసీనది జియాగూడ పరిసరాల్లో ఉన్నాయి. మూసీనదిలో ఉధృతి పెరుగుతున్నందువల్ల గుడిసెవాసులను కేశవస్వామినగర్‌లోని షల్టర్‌కు తరలించగా వారు ఉపాధి పొందే జీహెచ్ఎంసీ బండ్లను సైతం వేరే చోట ఉంచారు.

### గోల్కొండ ఏసీపీగా సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: కొత్తగా ఏర్పాటైన గోల్కొండ జోన్ ఏసీపీగా సయ్యద్ ఫయాజ్ నియమితులయ్యారు. కొత్త పోలీస్ స్టేషన్ల ఏర్పాటు, డివిజన్‌ల మార్పులతో గోల్కొండ జోన్‌కు ఏసీపీ పోస్ట్ మాంజూరైంది. కాగా గోల్కొండ జోన్ ఏసీపీగా నియమితులైన సయ్యద్ ఫయాజ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

### గోషామహల్ ట్రాఫిక్ ఏసీపీగా ధనలక్ష్మి



అబిడ్స్: గోషామహల్ ట్రాఫిక్ ఏసీపీగా డి.ధనలక్ష్మి పదవీబాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏసీపీగా పని చేసిన కోటేశ్వర్‌రావు పదోన్నతిపై బదిలీ కావడంతో కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న ధనలక్ష్మిని గోషామహాల్‌కు డీజీపీ అంజనీకుమార్ బదిలీ చేశారు.

### పార్టీ టికెట్టు కేటాయిస్తే పోటీచేసి గెలుస్తా



ఎం.విక్రమ్‌గౌడ్

అబిడ్స్: గోషామహాల్ నియోజకవర్గంలో తన తండ్రి ఎం.ముఖేష్ గౌడ్ 30 సంవత్సరాలపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, చేశారని ఆయన ఆశయ సాధనకు తాను కృషి చేస్తానని దివంగత మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ తనయుడు, బీజేపీ రాష్ట్ర యువ నాయకుడు ఎం.విక్రమ్ గౌడ్ పేర్కొన్నారు. బీజేపీ అధిష్టానం తనకు టికెట్టు కేటాయిస్తే పోటీచేసి విజయం సాధిస్తానన్నారు. ఈ నెల 29న ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ముఖేష్‌గౌడ్ వర్ధంతి వేడుకలు నిర్వహించనున్న సందర్భంగా గురువారం వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షించారు. సామాన్య కార్యకర్తల నుంచి బడా నాయకుడి వరకు పార్టీలో టికెట్టు అడిగే హక్కు ఉంటుందన్నారు. పార్టీ అధిష్టానం ఎవ్వరికి టికెట్టు ఇచ్చినా మిగతావారంతా టికెట్టు పొందినవారిని పనిచేసి గెలిపిస్తామన్నారు.

### నేలకూలిన డ్రై క్లీనింగ్ దుకాణం

నాంపల్లి: ఆగాపురాలో ఓ పురాతనమైన ఎలక్ట్రిక్ డ్రై క్లీనింగ్ దుకాణం కూలిపోయింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తడిసి నేలమట్టమైంది. ఈ సంఘటన హబీబ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆగాపుర సెంట్రల్ బేకరీకి ఎదురుగా చోటుచేసుకుంది. స్థానికంగా నివాసం ఉండే రమేష్ సింగ్ (55) అక్కడ ఎలెక్ట్రిక్ ల్యాండ్రీ దుకాణం నడుపుతున్నారు. గురువారం ఉదయాన్నే దుకాణం తెరిచేందుకు వెళ్లగా కూలిపోయిన విషయాన్ని గమనించారు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని పరిశీలించారు.

### సుద్దాల అశోక్‌తేజకు సినారే పురస్కారం ప్రదానం

సుల్తాన్‌బజార్: డాక్టర్ సి.నారాయణరెడ్డి కారణజన్ముడని వక్తలు కీర్తించారు. తెలంగాణ సారస్వత పరిషత్, సుశీల నారాయణ రెడ్డి ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో గురువారం సాయంత్రం సినారే 92వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా ప్రముఖ సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజకు డాక్టర్ సి.నారాయణరెడ్డి సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు.

### 11 మందికి జైలు శిక్ష

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన 11 మందికి జైలు శిక్ష విధించారు. మద్యం సేవించి పట్టుబడిన, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన, డ్రైవింగ్ లైసెన్స్ రద్దైన తరువాత కూడా వాహనాలు నడిపిన వారికి వాహనాలు ఇచ్చిన వాహనాదారులుపై రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.బోస్‌కిరణ్ 13 మందిపై చార్జ్‌షీట్ నమోదు చేసి వారిని కోర్టులో హజరుపరిచారు. 3వ స్పెషల్ ఎంఎం కోర్టు మెజిస్ట్రేట్ సజీరుద్దీన్ షా ముందు 13 మంది ప్రతివాదులను హజరుపరచగా వారిలో 11 మంది ప్రతివాదులకు న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు. అందులో ఒకరికి ఐదు రోజులు, ఒకరికి నాలుగు రోజులు, ఏడుగురికి మూడు రోజులు, ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. అదే విధంగా మిగిలిన వారికిజరిమానా విధించారు.



పురానాపూల్ వంతెన దిగువన మూసీనది ఉధృతి

# పురానాపూల్ వద్ద మూసీ ఉధృతి

జియాగూడ: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న కారణంగా పురానాపూల్ వద్ద మూసీనది పొంగిపొర్లుతోంది. బుధవారం రాత్రి హిమాయత్‌సాగర్ నుండి నాలుగు గేట్లను ఎత్తి నీటిని దిగువ మూసీనదిలోకి వదిలారు. దీంతో కార్వాన్, జియాగూడ, కేశవస్వామినగర్, పురానాపూల్, జుమ్మెరాత్‌బజార్ ప్రాంతాల్లో నీటి ఉధృతి పెరిగింది. దీంతో మూసీనదిలో ఉపాధి పొందుతున్న చాకిరేవులు, నీట మునిగాయి. మందిరాలు సైతం పూర్తిగా మునిగిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. లోతట్టు ప్రాంతాలైన జియాగూడ కేశవస్వామినగర్ ఒడ్డున ఉన్న సుమారు 20 గుడిసెల వాసులను పైకి తరలించి షెడ్లలో ఉంచినట్లు అధికారులు తెలిపారు. అలాగే వారి ఉపాధికి సంబంధించిన జీహెచ్ఎంసీ చెత్త బండ్లను కూడా పైకి తరలించినట్లు అధికారులు తెలిపారు. జాతీయ రహదారి ఒడ్డున మూసీనది ఉన్నప్పటికి ప్రస్తుతానికి జాతీయ రహదారిలోకి మూసీనది నీరు చేరలేదు. గండిపేట జలాశయం గేట్లు ఎత్తితే పురానాపూల్ 100 ఫీట్ల జాతీయ రహదారి మునగడం ఖాయం. దీంతో ఈ ప్రాంతాల ప్రజలను కూడా అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.



మూసీనదిలో నీట మునిగిన దేవాలయాలు

## ప్రమాదకరంగా మారిన నాలాలు



హకీంపేట్ కుంటలో ధ్వంసమైన బుల్కాపూర్ నాలా ప్రహరీ



బుల్కాపూర్ నాలాలో నిండిన వ్యర్థాలు

గోల్కొండ: వర్షాలకు నాలాలు ప్రమాదకరంగా మారాయి. అధికారులు సకాలంలో నాలాల పూడిక తీయకపోవడంతో నాలాలు పొంగి పొర్లుతున్నాయి. దశాబ్దాలుగా నాలాలు వర్షాకాలంలో పొంగుతున్న విషయం అధికారులకు తెలిసిందే. అయినా కూడా అధికారులు పట్టించుకోవడం లేదు. నాలాలలో టన్నులకొద్ది వ్యర్థాలు పేరుకుపోయాయి. బుల్కాపూర్ నాలా, అహ్మద్‌నగర్ నాలాలు చెత్త వ్యర్థాలతో నిండిపోయాయి. వర్షాలకు అవి పొంగిపొర్లుతున్నాయి. వర్షపు నీటితో పాటు వర్షంలో కొట్టుకువచ్చిన వ్యర్థాలు కూడా నాలాలో నిండిపోతున్నాయి. హకీంపేట్ సాలార్ బ్రిడ్జి, విరాట్ నగర్ కుంట తదితర ప్రాంతాలలో బుల్కాపూర్ నాలా ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. ఈ నాలాకు పలుచోట్ల ప్రహరీ కూలిపోయింది. మరికొన్ని చోట్ల నాలాకు అసలు ఫెన్సింగ్ లేదు. దీంతో కూరగాయల వ్యాపారులవారు, హోటళ్ల వారు వ్యర్థాలను తెచ్చి నాలాలో వేస్తున్నారు. దీంతో నాలాలో నీరు ముందుకు కదలడమే గగనమైపోయింది. ఈ కారణంగా నాలాలు పొంగిపొర్లుతున్నాయి.

### బంగారు మైసమ్మకు మారు బోనం

చార్మినార్: హరిబౌలిలోని బంగారు మైసమ్మ దేవాలయం అమ్మవారికి దేవాలయం కమిటీ ప్రతినిధులు మారుబోనం సమర్పించారు. భక్తి శ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు అధికార, అనధికార ప్రముఖులతో పాటు భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం కమిటీ ప్రతినిధులు వినయ్ దిలీకర్, మధుసూదన్ యాదవ్, అనంతోజు హన్స్‌రాజ్, బుల్లెట్ శ్రీధర్ పాల్గొన్నారు.



మారుబోనం కార్యక్రమంలో దేవాలయాల కమిటీ ప్రతినిధులు

## పాతబస్తీలో అందుబాటులో లేని మినీ బస్సులు

చార్మినార్: పాతబస్తీలో మినీ బస్సులు కనుమరుగయ్యాయి. ఒకప్పుడున్న రూట్‌లలో ప్రస్తుతం మినీ ఆర్టీసి బస్సుల రాకపోకలు పూర్తిగా తగ్గిపోయాయి. టిక్కెట్ల ద్వారా ఆదాయం లేదనే సాకుతో ఆర్టీసీ బస్సుల ట్రిప్పులను అధికారులు తగ్గించారు. ఇంకా కొన్ని రూట్‌లలో పూర్తిగా తొలగించారు. దీంతో ఆయా రూట్‌లలో ఆర్టీసీ ప్రయాణీకులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో పాతబస్తీతో పాటు నగరంలో తిరగడానికి చార్మినార్ కట్టడం వద్ద కొత్త మినీ బస్సుల ప్రారంభోత్సవాన్ని పెద్ద ఎత్తున జెండా ఊపి ప్రారంభించారు. కొన్ని రోజుల పాటు పాతబస్తీలోని అంతర్గత రోడ్లలతో సైతం మినీ బస్సులు నడిచాయి. ఎంతో మంది స్కూలు విద్యార్థులతో పాటు ఉద్యోగులు, వ్యాపారులకు ఈ మినీ బస్సులు సౌకర్యంగా మారాయి. రానురాను వీటి ట్రిప్పులను తగ్గించిన అధికారులు ప్రస్తుతం పూర్తిగా రద్దు చేయడంతో పాతబస్తీలో కనిపించకుండా పోయాయి.



మినీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు (ఫైల్)



చంద్రశేఖర్ ఆజాద్, ఎమ్మెల్సీ కవితలను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు మేకల విష్ణువర్ధన్

### భీమ్ ఆర్మీచీఫ్‌కు సన్మానం

అబిడ్స్: నగరానికి వచ్చిన భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ రావత్, ఎమ్మెల్సీ కవితలకు గోషామహాల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు మేకల విష్ణువర్ధన్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ.... దేశంలో ఎక్కడా లేని విధంగా 125 అడుగుల డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఏర్పాటు చేశారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో అన్నివర్గాల ప్రజలకు పలు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు.

## ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు

రాజేంద్రనగర్: గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రధాన రహదారులు కాలనీలు, బస్తీలలో నీటి నిలువ ఉండకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు రాజేంద్రనగర్ డిప్యూటీ కమీషనర్ కె.రవికుమార్ తెలిపారు. గురువారం సర్కిల్ పరిధిలోని ఆరాంఘర్ చౌరస్తా నుంచి హసన్‌నగర్ వైపు వెళ్లే రహదారిలో రాందేవ్‌బాబా గుడి సమీపంలో వరద నీరు భారీగా రావడంతో డీఈ శంకర్, అసిస్టెంట్ ఇంజనీర్ నాగిరెడ్డి, సిబ్బందితో కలిసి పనులు చేపట్టారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో భారీ వరద నీటి రావడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారని అధికారులు సిబ్బంది క్షేత్రస్థాయిలో పపర్యటించి ప్రేత్యక చర్యలు తీసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.



వరద నీరు నిలిచిపోవడంతో సమస్యలను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ రవికుమార్

### చెట్టుపై నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

సుల్తాన్‌బజార్: చెట్టుమీది నుంచిపడి ఓ గుర్తుతెలియని వ్యక్తి(35) మృంతిచెందిన సంఘటన గురువారం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్.ఐ.కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిన వివరాల మేరకు..ఈ నెల 26న బడీచౌవిడిలోని నాయాబజార్ ప్రభుత్వ పాఠశాల వద్ద చెట్టుమీద నుంచి పడడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు గాయపడిన వ్యక్తిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ... గురువారం మృతిచెందాడు.

### రేపు ట్రాఫిక్ నిబంధనలు

చార్మినార్: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా ఈ నెల 29న పదో మొహర్రంను పురస్కరించుకొని పాతబస్తీ చార్మినార్ ప్రధాన వీధుల్లో నిర్వహించే బీబీకా ఆలం సామూహిక ఊరేగింపుకు ట్రాఫిక్ నిబంధనలు అమలులో ఉంటాయని నగర ట్రాఫిక్ అడిషనల్ పోలీసు కమిషనర్ జి.సుధీర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. బీబీకా ఆలంల సామూహిక ఊరేగింపు ముగిసేంత వరకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా దారి మళ్లించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా దారి మళ్లింపులు కొనసాగుతాయన్నారు.

### ఆకట్టుకున్న స్వప్న వసంతం

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాటకరంగ సంస్థ రసరంజని ఆధ్వర్యంలో బి.స్టూడియో నిర్వహణలో గురువారం రవీంద్రభారతిలో స్వప్న వసంతం అనే నాటకాన్ని ప్రదర్శించారు. షేక్‌స్పియర్ రచించి నటువంటి ఒక రచన ఆధారంగా జాన్‌బషీర్ దర్శకత్వంలో సాగిన ఈ నాటకం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది.

### యుద్ధ ప్రాతిపదికన డ్రైనేజీ పనులు

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో యుద్ధ ప్రాతిపదికన డ్రైనేజీ పనులు పూర్తి చేయిస్తానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని ఖాదర్‌బాగ్, ఇందిరానగర్, ఫోర్‌మిల్ తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాలలో స్థానికులను కలుసుకున్నారు. మోరీలు పొంగిపొర్లుతున్నాయని, ఇంట్లో నుండి బయటకు రాలేకపోతున్నామని పలువురు ఆయనకు ఫిర్యాదు చేశారు.

### భారీ వర్షాలకు ముందు జాగ్రత్త చర్యగా ఏర్పాట్లు

అబిడ్స్: భారీ వర్షాలతో గోషామహాల్ నియోజకవర్గం నలుమూలలా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పలు ఏర్పాట్లు చేశామని నాంపల్లి తహశీల్దార్ ప్రసాద్ వెల్లడించారు. గురువారం గోషామహాల్ నియోజవర్గం బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ తహశీల్దార్ ప్రసాద్‌ను కలిసి నియోజకవర్గంలోని మూసీ ఒడ్డున ఉన్న ప్రాంతాలు, పాతభవనాలలో ఉన్న వారి వివరాలను తెలిపారు. వారందరికి సమస్యలు తలెత్తకుండా చూడాలని తహశీల్దార్‌కు వివరించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

### అపార్ట్‌మెంట్‌పై ఒరిగిన భారీ వృక్షం



నాంపల్లి: ఎడతెరిపి లేకుండా ఈదురుగాలులతో కురుస్తున్న వర్షాలకు నాంపల్లి పటేల్‌నగర్ సాయి కృప అపార్ట్‌మెంట్ సమీపంలోని ఒక పెద్ద కొబ్బరి చెట్టు కూలి అపార్ట్‌మెంట్ మీదపడింది. దీంతో అపార్ట్‌మెంట్ స్వల్పంగా దెబ్బతిన్నది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది అక్కడి చేరుకుని భారీ వృక్షాన్ని తొలగించారు.

### కోట మైసమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అదనపు డీసీపీ ఎం.వెంకటేశ్వర రావు దంపతులు

చార్మినార్: గౌలిపురా కోట మైసమ్మ దేవాలయాన్ని అదనపు డీసీపీ ఎం.వెంకటేశ్వర రావు దంపతులు సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం కమిటీ కార్య నిర్వాహక అధ్యక్షులు కె.ఎస్.ఆనంద్ రావు ఆలయ మర్యాదలతో వారికి ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు.

# రేపు పదో మొహర్రం ఊరేగింపు..

**బందోబస్తును పరిశీలించిన సీటీ సీపీ సీవీ ఆనంద్**

చార్మినార్: పదో మొహర్రం సందర్భంగా ఈ నెల 29న, పాతబస్తీ వీధుల్లో నిర్వహించే బీబీకాఆలం అంబారీ సామూహిక ఊరేగింపును పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు గురువారం నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, నగర అదనపు పోలీసు కమిషనర్ (లా అండ్ ఆర్డర్) విక్రం సింగ్ మాన్, దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య, మీర్‌చౌక్ ఏసీపీ దామోదర్‌రెడ్డి తదితరులు డబీర్ పురాలోని బీబీ కా అలావాను సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఈ నెల 29న నిర్వహించనున్న పదో మొహర్రం సామూహిక ఊరేగింపు ఏర్పాట్లు, బందోబస్తు తదితర అంశాలపై చర్చించారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌కు చెందిన మాధురి అనే ఏనుగుతో బీబీ కా ఆలం సామూహిక ఊరేగింపు కొనసాగనుంది. డబీర్‌పురా బీబీకాఅలావా నుంచి బయలు దేరే ఈ ఊరేగింపు చార్మినార్ కట్టడం రోడ్డు ద్వారా గుల్జార్‌హౌజ్, కాలీకమాన్, మీరాలంమండి,పురానాహవేలీ, దారుషిఫా మీదుగా చాదర్‌ఘాట్ వరకు కొనసాగనుంది. దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య, మీర్‌చౌక్ ఏసీపీ దామోదర్ రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ఇప్పటికే రిహార్సల్స్ జరిగాయి.

**స్వాగత వేదిక...**

పదో మొహర్రం సామూహిక ఊరేగింపును పురస్కరించుకుని మీరాలంమండి మహంకాళేశ్వర దేవాలయం కమిటి ఆధ్వర్యంలో మీర్‌చౌక్ పోలీసు స్టేషన్ ముందు గత ప్రధాన రోడ్డులో స్వాగత వేదిక ఏర్పాటు చేసి అంబారీపై ఊరేగింపుగా వచ్చే బీబీ కా ఆలంకు స్వాగతం పలుకనున్నారు. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాలయం కమిటి చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. తాము ప్రతి ఏడాది బీబీ కా ఆలం ఊరేగింపుకు స్వాగతం పలుకుతామన్నారు. ఈ స్వాగత వేదికపై నుంచి కుల,మతాలకు అతీతంగా పలువురు అధికార,అనధికార ప్రముఖులు పాల్గొని స్వాగతం పలుకుతారన్నారు.



బీబీ కా ఆలంకు దట్టీలు కట్టి మొక్కులు చెల్లించుకుంటున్న నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్

## వర్షపు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే

యాకుత్‌పురా: గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. యాకుత్‌పురా రైల్వే స్టేషన్, ఎస్సార్టీ కాలనీ, మౌలాకా చిల్లా, అజ్మత్‌నగర్, మదీనానగర్, దోభిఘాట్, యశ్రఫ్‌నగర్, తలాబ్‌కట్టా, భవానీనగర్, చాచా గ్యారేజీ, సిద్దిఖీనగర్, మురాద్ మహల్, జహంగీర్‌నగర్, ఆమన్‌నగర్, సిద్దిఖీనగర్ ప్రాంతాల్లో వరదనీటితో రోడ్లు జలమయమయ్యాయి. ఈ ప్రాంతాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీయుద్దీన్, నాయకులు, జీహెచ్ఎంసీ మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలతో సహాయక చర్యలు చేపట్టారు.

**వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే పాషా ఖాద్రీ...**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జలమయమైన పలు లోతట్టు ప్రాంతాలను గురువారం యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ, కార్పొరేటర్ సన్రీన్ సుల్తానా, పలు విభాగాల అధికారులతో కలిసి పరిశీలించారు.



బస్తీల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ

### కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ

గోల్కొండ: మణిపూర్‌లో మానవత్వం మంటకలిసేలా బీజేపీ వారు గిరిజనులపై దౌర్జన్యాలు, అత్యాచారాలు చేస్తున్నారని షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బి. సత్యనారాయణ అన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండను నిరసిస్తూ గురువారం షేక్‌పేట్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. గిరిజనులపై జరుగుతున్న దౌర్జన్యాలను ప్రధాని మోదీ ఖండించడం లేదని ఆయన అన్నారు.



కాంగ్రెస్ ఆధ్వర్యంలో షేక్‌పేట్‌లో బైక్ ర్యాలీ

## ఆలంలను దర్శించుకున్న సీనియర్ సివిల్ జడ్జి

డబీర్‌పురా: డబీర్‌పురా బీబీకా అలావాలో కొనసాగుతున్న మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకొని గురువారం సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డి.కళార్చన అలావాను సందర్శించి ఆలంలకు పూలు, దట్టీలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు అలావా నిర్వాహకులు ఆమె ఘనంగా స్వాగతం పలికి మొహర్రం బుక్‌ను అందజేశారు.



ఆలంలను దర్శించుకున్న డి.కళార్చనకు దట్టీలు కడుతున్న నిర్వాహకులు

## ఎస్ఎన్‌డీపీ నాలా పనులను పరిశీలించిన డీసీపీ



పనులను పరిశీలిస్తున్న డీసీపీ రూపేష్ కుమార్

చాంద్రాయణగుట్ట: బార్కాస్ గుర్రం చెరువు దిగువ నుంచి బాబానగర్ వరకు నిర్మిస్తున్న ఎస్ఎన్‌డీపీ నాలా పనులను సౌత్ ఈస్ట్ డీసీపీ సి.హెచ్.రూపేష్ కుమార్ గురువారం పరిశీలించారు. డీఎల్ఆర్ఎల్ ప్రహరీ పక్క నుంచి వెళుతున్న ఈ నాలా పనులు ఇంకా సాగుతుండడం....భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చాంద్రాయణగుట్ట కార్పొరేటర్ అబ్దుల్ వాహబ్‌తో చర్చించారు.

## జాతీయ రహదారిలో మురుగు నీరు

జియాగూడ: జియాగూడ 100 ఫీట్ల జాతీయ రహదారిలో గత కొన్ని నెలలుగా డ్రైనేజి నిర్మాణం పనులు నత్తనడకన కొనసాగుతుండగా జియాగూడ ఎగువ బస్తీల డ్రైనేజీ మురుగు నీరు జాతీయ రహదారిలో పారుతుంది. నిర్మాణం పనులు పూర్తికాకపోవడం వల్లే డ్రైనేజి పొంగిపొర్లుతుందని స్థానిక సంజయ్ నగర్, శివ్‌బాగ్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోనాల పండుగ సమయంలో మాత్రం శుభ్రపరిచినప్పటికీ ప్రస్తుతం యథావిధిగా రోడ్లపై డ్రైనేజి పొంగిపొర్లుతోంది. దీంతో తీవ్ర దుర్గంధంతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో స్థానిక బస్తీల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



జాతీయ రహదారిలో పారుతున్న మురుగునీరు



భాగవత్ కథలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు పప్పుమాత్రే తదితరులు

### ఘనంగా శ్రీమద్భాగవత్ కథ

అబిడ్స్ : గోషామహాల్ స్టేడియంలో శ్రీమద్భాగవత్ కథ ఘనంగా నిర్వహించారు. బృందావన్ ఆశ్రమం అనిరుధ్ చార్య మహారాజ్ మానవుడి జీవన శైలిపై, ఆధ్యాత్మిక భావనపై పలు బోధనలు చేశారు. ప్రతి ఒక్కరు కొంతసేపు అయినా భగవంతుడి ధ్యాసలో ఉండాలని ఆయన అన్నారు. గోషామహాల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు పప్పుమాత్రే, కోటి శైలేష్ కురుమ, ప్రదీప్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.